అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023

వేములవాడకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాశివరాత్రిని పురస్కరించుకొని వేములవాడ వెళ్లే భక్తుల కోసం ఆదిలాబాద్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17 నుండి 18 వరకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2గంటలకు, సాయంత్రం 4గంటలకు ఈ బస్సులు ఉంటాయన్నారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఆదిలాబాద్ నుండి వేములవాడకు వెళ్లే ప్రయాణికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

టీజీబీ లావాదేవీపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాతనపల్లి బ్రాంచ్‌లో ఆ బ్యాంక్ మేనేజర్ ఎస్.రమణి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు, జీరో బ్యాలెన్స్ అకౌంటు తీసుకొని ఇన్సూరెన్స్ సదుపాయం పొందాలని తెలిపారు. అలాగే బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. డిపాజిట్ల ద్వారా జనరల్ కేటగిరీ వారికి 7.40, సీనియర్ సిటిజెన్స్‌కి 7.90శాతం 666 రోజులు వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఓ రాజేంద్రకుమార్, క్యాషియర్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ముగిసిన నవోదయ ప్రవేశపరీక్ష గడువు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,920 దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు తేదీ బుధవారంతో ముగిసింది. ఈ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,920 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది పోలిస్తే ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య తగ్గింది. కొత్త జిల్లాల వారీగా చూస్తే ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లా నుండి 1,378, నిర్మల్ జిల్లా నుండి 1,589, మంచిర్యాల జిల్లా నుండి 1,526, కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా నుండి 1,427 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు గడువు తేదీని నవోదయ విద్యాలయ సమితి రెండు సార్లు పెంచింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా, అదే నెల 31 వరకు గడువు తేదీగా నిర్ణయించారు. అప్పటి వరకు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో దీనిని ఫిబ్రవరి ఎనిమిదో తేదీ వరకు పెంచారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కావడం, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఈ గడువు తేదీని ఈనెల 15 వరకు పొడిగించారు. రెండుసార్లు గడువు తేదీ పొడిగించినా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 227 దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్ 29న ప్రవేశపరీక్ష జరగనుంది. ప్రవేశపరీక్ష రాసేందుకు ఉండే నిబంధనలను కఠినతరం చేయడం, వయస్సు వ్యవధిలో మార్పులు తీసుకురావడం, ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య తగ్గడానికి కారణమై ఉండవచ్చని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి తెలిపారు.

20న పోడు పట్టాల మహా ధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

పోడు భూములకు పట్టాల కోసం 20న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు అన్నారు. గురువారం విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే పోడు భూములకు పట్టాలు వస్తాయని ఆశపడ్డ పోడు రైతులకు కెసిఆర్ పాలనలో నిరాశ మిగిలిందన్నారు. మూడు దఫాలుగా సర్వేలు నిర్వహించి చివరికి రాష్ట్రంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని హడావిడి ప్రచారం చేస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. కుటుంబానికి మూడు సెంట్లు నుండి రెండు మూడు ఎకరాలకు మించకుండా పట్టాలు ఇస్తానని ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఇది కూడా అధికారం కోసమే ఆడే నాటకం అని తెలిపారు. ఇప్పటికైనా కెసిఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి 10ఎకరాల భూమికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు అడవులను ధారాదత్తం చేసే చట్టాన్ని ఉపసంహరించుకుకోవాలని రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గోపి నర్సయ్య, సహాయ కార్యదర్శి మంచుకంటి లక్ష్మణ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్, గిరిజన సంఘం నాయకులు అబ్దుల్, గోనె స్వామి, గంగన్న, గుట్ల ప్రసాద్, లింగన్న పాల్గొన్నారు.

మేలు జాతి పశు సంతతితో ఆర్థికాభివృద్ధి

నవతెలంగాణ-భీమారం

మేలు జాతి పశు సంతతిని పెంపొందించుకోవడం ద్వారా పాడి రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని జిల్లా పశువైద్యాధికారి వై.రమేష్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ధర్మారం గ్రామంలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేశవాళి పశువులకు కృత్రిమ గర్భధారణ వలన గలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. దేశవాళి పశువులకు మేలు జాతి పశువుల వీర్య దానంతో మేలు జాతి దూడలు పుట్టి పాల దిగుబడి పెరుగుతుందన్నారు. దీంతో రైతు ఆర్థిక లాభం పొందవచ్చని వివరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరం ద్వారా 45 పశువులకు గర్భ కోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వేసవి కాలం సమీపిస్తున్నందున పాడి పశువులకు పచ్చి మేత కొరతను అధిగమించేందుకు రైతు ఇంటి పెరట్లో కాని వ్యవసాయ క్షేత్రాలలో గాని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఈ.శంకర్, మండల పశువైద్య అధికారి రాకేష్ శర్మ, సర్పంచ్ చడంక లక్ష్మీ, గోపాలమిత్ర సంపత్, కె.రమేష్, పశు వైద్య సిబ్బంది నరసింహులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ పంటను సాగు చేసుకోవాలి

నవతెలంగాణ - దహెగాం

రైతులు ఆయిల్‌ఫామ్ పంటను సాగు చేసుకోవాలని ఏఓ వంశీకృష్ణ అన్నారు. గురువారం హత్తిని గ్రామంలో క్షేత్రస్థాయిలో సాగవుతున్న ఆయిల్‌ఫామ్ పంట గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ మొక్కలు ప్రభుత్వం నుండి సబ్సిడీ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక మొక్క పూర్తి ధర రూ.193 ఉండగా రూ.173 సబ్సిడీగా ప్రభుత్వం చెల్లిస్తుందని, రైతు కేవలం రూ.20 మాత్రమే తన వాటాగా చెల్లించాలన్నారు. ఎకరానికి 57 మొక్కల చొప్పున ఎన్ని ఎకరాలు సాగుచేస్తున్న సబ్సిడీ వర్తిస్తుందన్నారు. రైతులకు డ్రిప్స్ కూడా సబ్సిడీ ద్వారా ఇవ్వడం జరుగుతుందని, ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. బీబ్రా, దహెగాంలో కూడా ఏఈఓలు రైతులకు ఆయిల్‌ఫామ్‌పై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బండ కృష్ణమూర్తి, రైతుబంధు సమితి సభ్యులు నాయికిని లక్ష్మణ్, ప్రకాష్‌గౌడ్, ఏఈఓలు శోభన్, వెన్నెల, ఆనంద్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి


ఆసిఫాబాద్ : గతంలో జిల్లాలో 40 లారీల రేషన్ బియ్యం అక్రమం జరిగిందని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 40 లారీల భారీ రేషన్ కుంభకోణం జిల్లాలో బయటపడిందన్నారు. అయినప్పటికీ సంబంధించిన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. అప్పటి అక్రమాలపై ప్రత్యేక విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గణేష్, నాయకులు జయరాజ్, రాధిక, సందీప్ పాల్గొన్నారు.

చీరకు బదులు కట్ పీసులు

నార్నూర్ : తాడిహత్నూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అనితకు ఆన్‌లైన్ షాపింగ్‌లో చీరకు బదులు కట్ పీసులు వచ్చాయి. ఆమె నాలుగు రోజుల క్రితం మీసో ఆన్‌లైన్ యాప్‌లో రూ.360కి ఒక చీర చొప్పున రెండు చీరలను బుక్ చేసింది. గురువారం పార్శిల్ రావడంతో విప్పి చూడగా చీరకు బదులుగా కట్ పీసులు వచ్చాయి. వాటిని చూసి మహిళ కంగుతింది. మోసాలకు పాల్పడుతున్న మీసో ఆన్‌లైన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు డిమాండ్ చేస్తున్నారు.

ఆ ఇద్దరిదే హవా..!

- బాసర ఆలయంలో ఆ అధికారులు చెప్పిందే వేదం
- సీనియర్ అధికారికి విధులు కేటాయించని వైనం
- డిప్యూటేషన్‌పై ఇతరులను రప్పించడంలో కీలకపాత్ర



నవతెలంగాణ- బాసర

సరస్వతీదేవి కొలువైన బాసర ఆలయంలో ఇద్దరు అధికారుల హవా కొనసాగుతోంది. ఆలయంలో ఆ ఇద్దరు అధికారులు చెప్పిందే వేదం. ఏ అధికారి ఎక్కడ పని చేయాలన్నా వారు నిర్దేశించిన చోటనే విధులు నిర్వర్తించాలి. ఆలయ ఉన్నత అధికారిని మచ్చిక చేసుకొని ఆలయంలో ఇష్టారాజ్యంగా విధులు కేటాయిస్తున్నారనే విమర్శలున్నాయి. సదరు అధికారులు విధులు నిర్వర్తించాల్సిందేననే స్పష్టం చేయడంతో ఓ సీనియర్ అసిస్టెంట్ తన కుటుంబ వేడుకలకు సైతం ఆలస్యంగా వెళ్లిన సందర్భాలున్నాయి. కానీ ఆ సీనియర్ ఆలయ అధికారులు మాత్రం తమకు నచ్చినప్పుడు విధులకు ఎగనామం పెట్టి దర్జాగా ఆలయం విడిచి వెళ్లడం సర్వసాధారణంగా మారుతోంది. ఆ ఇద్దరు అధికారులను కాదని ఎవరు కూడా ఆలయంలో ఎలాంటి విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఉంది. తమకు సంబంధం లేని విషయాల్లో ఆ సీనియర్ అధికారులు అధికంగా జోక్యం చేసుకుంటూ కిందిస్థాయి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. దీనికి తోడు ఆలయంలోని వైదిక బృందంలో పనిచేసే ఓ అధికారికి ఆలయ ఈవో కార్యాలయంలోని ఓ సెక్షన్‌లోని పనులను అప్పగించడం ఆ ఇద్దరి అధికారుల హస్తం ఉందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. తమకు సంబంధం లేని విధులలో ఆ వైదిక బృంద సభ్యుడు జోక్యం చేసుకోవడం ఏంటని ఆలయ ఉద్యోగులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు నామమాత్రమే. ఆలయంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నా ఆలయ ఉన్నతాధికారి మాత్రం దృష్టి సారించడం లేదని అక్కడి సిబ్బంది చర్చించుకుంటున్నారు.

సీనియర్ అధికారికి విధులు కేటాయించలేదు

అమ్మవారి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఓ అధికారికి ఆలయంలో ఎలాంటి విధులను ఆలయ అధికారులు కేటాయించలేదు. కానీ తమకు నచ్చిన వారికి మాత్రం ఆ అధికారులు అధికంగా ఆదాయం కలిగించే పోస్టుల్లో విధులు కేటాయించినట్లు తెలిసింది. సీనియర్ అధికారికి మాత్రం ఎలాంటి విధులు కేటాయించకపోవడం గమనార్హం. గతంలో ఆ అధికారి అకౌంటెంట్‌గా నాలుగు సంవత్సరాలకుపైగా విధులు నిర్వర్తించారు. కానీ తాజాగా ఆ అధికారికి ఎలాంటి విధులు అప్పగించడం లేదు. రిటైర్మెంట్ అధికారులకు మాత్రం ఆ ఇద్దరు ఉన్నత అధికారులు తమకు అనువైన చోట విధులు కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ అధికారి రూముల గోల్‌మాల్‌ను ఉన్నత అధికారి దృష్టికి తీసుకొచ్చినా సంబంధిత అధికారులపై సంజాయిషీ నోటీసు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ప్రతి సెక్షన్‌లో అవినీతి జరుగుతున్నా ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. నూతనంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు అంతర్గత బదిలీలు చేపట్టలేదు. కొందరు అధికారులు ఆలయంలో మాత్రం ఐదు సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వర్తించడం పరిపాటిగా మారింది.

ఆ ఇద్దరు అధికారులదే హస్తం

అమ్మవారి ఆలయంలో సిబ్బంది లేరనే సాకుతో ఆలయంలోని ఇద్దరు సీనియర్ ఉన్నత అధికారులు రిటైర్మెంట్ పొందిన అధికారులను ఆలయంలో విధులు నిర్వర్తించేలా గతంలో పనిచేసిన ఈవోకు సమాచారం ఇవ్వడంతో ఆగమేఘాల మీద ముగ్గురు అధికారులను ఆలయంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు రిటైర్మెంట్ అధికారులను సైతం ఆలయంలో పనిచేసేలా ఒప్పందం కుదుర్చుకోవడంతో వీరి సంఖ్య ఐదుకు చేరుకుంది. ఇందులో ఒక్కొక్కరికి రూ.15వేల నుంచి రూ.25వేల వరకు ప్రతినెలా వేతనం ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. గతంలో కోర్టులు రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులను నియమించుకోవద్దని ఆదేశాలు ఇచ్చినా బాసర ఆలయ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. రిటైర్మెంట్ అధికారులను కాకుండా డిగ్రీ పూర్తి చేసి కాలం వెళ్లదీస్తున్న యువకులు ఎంతో మంది ఖాళీగా ఉన్నారని, వారిని తీసుకుంటే నిరుద్యోగ భృతి కల్పించినట్లు అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆ దిశగా ఆలయ అధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.696 కోట్లతో సంపూర్ణ వాయు కాలుష్య ప్రాజెక్టు

- గడులోగా నిర్మాణ పనులు పూర్తి చేస్తాం
- సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్



నవతెలంగాణ-జైపూర్

పర్యావరణహిత మైనింగ్‌కు పెద్దపీట వేస్తున్న సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సంపూర్ణ కాలుష్య రహిత కేంద్రంగా తీర్చిదిద్దబోతున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. ఇందు కోసం రూ.696 కోట్లతో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) అనే అనుబంధ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గురువారం సింగరేణి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాణ సంస్థలతో సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్మాణపు పనులు గడువుకు ముందు పూర్తి చేసి ప్లాంట్‌ను ప్రారంభించాలని కోరారు. కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ఆదేశాలను అనుసరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో నిర్మిస్తున్న తొలి ప్రాజెక్టు ఇదేనని తెలిపారు. సాధారణంగా థర్మల్ పవర్ ప్లాంట్‌లలో బొగ్గును మండించడం ద్వారా వెలువడే ఉష్ణోగ్రతను వినియోగించి నీటిని ఆవిరి రూపంలోకి మార్చి దానితో టర్బైన్లను తిప్పుతూ విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రాథమిక పర్యావరణహిత చర్యగా బొగ్గును మండించడం ద్వారా వెలువడే బూడిద, విష వాయువులను శుద్ధిపరిచే ప్రక్రియను చేపడతారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గును మండించడం ద్వారా వెలువడే వాయువులో ఉండే బూడిదను తొలగించడానికి ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్ అనే అనుబంధ విభాగాన్ని వినియోగిస్తున్నారు. దీని ద్వారా బొగ్గును మండించగా వెలువడే వాయువులోనే ఉండే బూడిదను 100 శాతం గాలిలో కలవకుండా చూస్తారు. ఈ ప్రక్రియలో ప్రెసిపిటేటర్ విభాగంలో సమకూరిన బూడిదను ఫ్లైయాష్ అంటారు. ఈ ఫ్లైయాష్‌ను కూడా సిమెంట్, ఇటుకల నిర్మాణంలో కూడా వినియోగిస్తారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ఈ విధంగా ప్రతి ఏడాది విడుదలయ్యే ఫ్లైయాష్‌ను నూటికి నూరు శాతం సిమెంటు తదితర పరిశ్రమలకు సరఫరా చేస్తూ జాతీయ స్థాయిలో బెస్ట్ ఫ్లైయాష్ యుటిలైజేషన్ అవార్డును రెండు పర్యాయాలు అందుకుంది.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



నవతెలంగాణ-లక్సెట్టిపేట్

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షురాలు సురేఖ అన్నారు. గురువారం మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణమాఫీ, ఇల్లు నిర్మించుకునే వారికి ఇల్లు మంజూరు, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. రూ.500 గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల మరింతగా కల్పిస్తామన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం పేద ప్రజల పాలిట శాపంగా మారిందని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఉపేక్షించరని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, పట్టణ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, ఎంపీపీ అన్నం మంగ చిన్నన్న, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ కందుల మోహన్, ఎంపీటీసీ సుజాత, సురేష్, ముత్తె సుధాకర్, సీనియర్ నాయకులు పాయల్ చిన్నయ్య పాల్గొన్నారు.

జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత

నవతెలంగాణ-భీమారం



మండల కేంద్రంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గోస్కుల రాజేష్ తల్లిదండ్రులను గురువారం జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రాజా రమేష్ మిత్ర బందం కలిసి ఓదార్చారు. అదేవిధంగా మండలంలోని 6 బాధిత కుటుంబాలను కలిసి చేయూతగా ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యం, కొంత ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా జీఎస్ఆర్ ఫౌండేషన్ బాధితులకు అంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అంక్కయ్యగౌడ్, అయిలి నరేందర్, మేకల విజయ లక్ష్మి, సుధాకర్‌రెడ్డి, సళ్ల రాజిరెడ్డి, భారత్‌రెడ్డి, శ్రీరాములు, దంతాల మధునయ్య పాష, పూసల రమేష్, లజర్ దుర్గయ్య, రవీందర్, నరేష్ జీఎస్ఆర్ ఫౌండేషన్ మిత్రబందం సభ్యులు బద్రి సతీష్, ఉప్పులపు సురేష్, బుతగడ్డ రమేష్, ప్రకాష్, కిరణ్‌కుమార్, వేణు పాల్గొన్నారు.

వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడం హర్షణీయం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గని 44 రోజుల ముందుగా నిర్దేశిత వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడం హర్షణీయమని ఆర్కే-7 గనుల గ్రూపు ఏజెంట్ ఎన్.సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆర్కే-న్యూటెక్ గనిపై గని మేనేజర్ ఇ. స్వామిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏజెంట్ సత్యనారాయణ, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్కే-న్యూటెక్ గని 2022-23 వార్షిక లక్ష్యం 1,60,000 టన్నులను 44 రోజుల ముందుగా చేరుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. గని అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, నాయకుల సమన్వయంతో పని చేయడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఇదే స్ఫూర్తిని రాబోవు రోజుల్లో కొనసాగించాలని తెలిపారు. భూగర్భ గనుల్లో కంపెనీ వ్యాప్తంగా ఆర్కే-న్యూటెక్ గనికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గని ఉద్యోగులు కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. గని మేనేజర్ స్వామిరాజు మాట్లాడుతూ వార్షిక సంవత్సరం మార్చి చివరి నాటికి అధికోత్పత్తి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగులందరూ విధుల్లో చిత్తశుద్ధి చూపడం వల్లనే ముందుగా లక్ష్యాన్ని చేరుకొన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేష్, టీబీజీకేఎస్ ప్రతినిధి బుస్స రమేష్, సంక్షేమాధికారి పాల్‌క సృజన్, ఫిట్ ఇంజినీర్ రాజగోపాలచారి, ఇంజినీర్ కృష్ణ, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, వెంటిలేషన్ అధికారి శంకరయ్య, జేఓ స్టాన్లీ జోన్స్, అండర్ మేనేజర్లు మిట్టపల్లి శ్రీనివాస్, సాత్విక్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

తలమడుగు : మండలంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను ట్రైనీ కలెక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ ద్వారా ఎన్ని రకాల పనులు నిర్వహిస్తున్నారని మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని డబ్బులు సంపాదిస్తున్నారని కూలీలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో డబ్బులు వస్తున్నాయా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం జాబ్ కార్డులను పరిశీలించారు. పనుల వద్ద కూలీలకు తాగునీరు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని మండల అధికారులను కోరారు. ఆమె వెంట ఎంపీడీఓ రమాకాంత్, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

జాతీయస్థాయి బ్యాల్ బ్యాడ్మింటన్ క్రీడలు ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

41వ జాతీయస్థాయి బాల, బాలికల సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను గురువారం ఎమ్మెల్యే దివాకర్‌రావు, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌తో కలిసి ప్రారంభించారు. గురువారం నుండి 20 వరకు పోటీలు నిర్వహించబడతాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయస్థాయి క్రీడా పోటీలు ప్రగతి మైదానంలో నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ పోటీలలో దాదాపు 20 రాష్ట్రాలు పోటీ పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రీడపై పట్టు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, భవిష్యత్తులో జాతీయ స్థాయి నుండి ప్రపంచ స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడా అసోసియేషన్ నాయకులు నారాయణరెడ్డి, రామ్‌కిషన్, టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, డీజీఎం సివిల్ శివరావు సింగరేణి అధికారులు, క్రీడా అసోసియేషన్ అధికారులు పాల్గొన్నారు.

విద్యను ప్రాథమిక హక్కుగా భావించాలి



నవతెలంగాణ-తాంసి

బడీడు పిల్లలు బడిలోనే ఉంటూ విద్యను ప్రాథమిక హక్కుగా భావించాలని, సమాజం భాగస్వామ్యం లేనిదే ఏ కార్యక్రమమూ విజయవంతం కాదని సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిత సంస్థ, విద్యా శాఖ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, సర్పంచ్‌లు విద్యా ప్రణాళిక వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. బాలల స్నేహపూరిత వాతావరణం, పాఠశాలలో బాలల భద్రత, బాలల హక్కుల రక్షణ, పాఠశాల యాజమాన్య కమిటీ విధులు బాధ్యతలను వివరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బడీడు పిల్లలను బడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మహిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో నెలకు రూ.2వేల ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి నారాయణ, ఎంఈఓ శ్రీకాంత్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణ ప్రకాష్, ఎస్ఎంఎస్ చైర్మన్ విలాస్, కేశవస్వామి, రాయిసెంటర్ సార్‌మేడి ఆన్ను పటేల్, మహిత ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, కోఆర్డినేటర్ త్రివేణి, రాజు పాల్గొన్నారు.

చదువులోనే కాదు.. సాయంలోనూ ముందుంటాం



నవతెలంగాణ - రెబ్బెన

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో గురువారం పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని నవనీతకు గుండెలో రంధ్రం కారణంగా చికిత్స చేశారు. నవనీత అవసరాల నిమిత్తం విద్యార్థులు రూ.1.15 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. గురుకుల బాలికల కళాశాలలో ఐదో తరగతి నుండి ఇంటర్ వరకు చదువుకున్న విద్యార్థులు తమ గొప్ప మనసుతో తమకు తోచినంత సాయం చేశారు. దీనికితోడుగా విద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది కూడా తమవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయాన్ని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ గురుకుల విద్యాలయం ఆర్‌సీ కొప్పుల స్వరూపరాణి, మండల సాంఘిక సంక్షేమ కళాశాల విద్యాలయం ప్రిన్సిపల్ పి జ్యోతి, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు బాబురావు విద్యార్థినుల సమక్షంలో విద్యార్థిని నవనీత తల్లి వీణ, మామయ్య మహేందర్‌కు అందజేశారు.

బీసీ సంఘం అభివృద్ధికి కషి : కాంగ్రెస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతనంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన చిక్కల దత్తు, కలాల శ్రీనివాస్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని శాలువాతో సత్కరించారు. బీసీ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ అంబకంటి అశోక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శాంతన్‌రావు, కాంగ్రెస్ మాజీ టౌన్ ప్రెసిడెంట్ వసీం, ఆదిలాబాద్ మండల ప్రెసిడెంట్ సంజయ్, మావల మండల అధ్యక్షులు శేఖర్, మావల ఎంపీటీసీ గోవర్ధన్‌రెడ్డి, భీంసరి ఉప సర్పంచ్ మల్లయ్య, తిప్పె నారాయణ, దండు మధుకర్ పాల్గొన్నారు.

అధికారులు ప్రజల సమస్యపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-పెంబి



మండలంలోని ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భుక్యా కవిత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన మండలంఅని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధికి నిధులు మంజూరు చేపిస్తునట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తహసీల్దార్ శ్రీధర్ జడ్పీటీసీ జానకి రమేష్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీటీసీ రామారావు, గోదావరి నరేందర్ పాల్గొన్నారు. అనంతరం మండలానికి చెందిన మండపెల్లి నర్సావ్వ ఇటీవలే మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

తహసీల్దార్ ద్వారానే కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలి

నవతెలంగాణ-తలమడుగు

మహార్ కులస్తులకు కుల ధృవీరణ పత్రాలు ఆర్డీఓ ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారానే జారీ చేయాలని నేతకాని మహార్ సంఘం(టీఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మునీశ్వర్ సుదర్శన్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఖోడద్ గ్రామంలో మహార్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులఅందరికి దళిత బంధు కేటాయించాలని, దళితబస్తీ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న దళితులకు 15 శాతం రిజర్వేషన్ కేటాయించాలని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాటిల్ రామారావు, జిల్లా అధ్యక్షుడు కాంబ్లే భీంరావు, మండల అధ్యక్షుడు మునేశ్వర్ స్వప్నిల్, మహిళా అధ్యక్షురాలు భగత్ చంద్రకళ, దుర్గే అనీల్, మునేశ్వర్ ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం బహుజనులు ఏకం కావాలి

- బీఎస్‌పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-కడెం

బహుజన రాజ్యం రావాలంటే బహుజనులందురూ ఏకం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కన్వినర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కడెం మండలంలోని పాత మద్దిపడగ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడులు శిథిలావస్థకు చేరుకున్నయన్నారు. పలు పాఠశాలలలో వర్షాకాలంలో గోడలకు విద్యుత్ సరఫరా అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా, వైద్యం అందించటంలో ప్రభుత్వ పూర్తిగా విఫలమైదన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పీ జిల్లా నాయకులు బన్సీలాల్ జగన్మోహన్ పాల్గొన్నారు

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బాధిత పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి బరోసా ఇచ్చారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాలో డిసెంబర్ నెలలో వివిధ కారణాలతో మరణించిన ముగ్గురు పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులకు కోఆపరేటివ్ చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో బేల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ డిసెంబర్ నెల 30వ తేదీన అనారోగ్య కారణంగా మరణించిన నాగేశ్వర్ కుటుంబ సభ్యులకు రూ.83,777 విలువైన కోపరేటివ్ చెక్కును అతని భార్య పూజకు జిల్లా ఎస్పీ అందజేశారు. అదేవిధంగా తాంసి పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తూ డిసెంబర్ 30వ తేదీన అనారోగ్య కారణంగా మరణించిన ఏవి రమణారెడ్డి హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు రూ.1,48,835 విలువైన కోపరేటివ్ చెక్కును కుటుంబ సభ్యులకు, భార్య విజయలక్ష్మికి అందజేశారు. డిసెంబర్ 6వ తేదీన ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తూ హార్ట్ ఎటాక్‌తో మరణించిన సిహెచ్ పరశురాం కుటుంబ సభ్యులకు రూ.1,72,793 విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉండి ఎలాంటి సహకారాలైన అందిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం ఏఓ యూనిస్ అలీ, సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 33వ వార్డు శాంతినగర్‌లో ఏర్పాటుచేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులు బాగా లేక మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసే పేదలకు తమ ప్రభుత్వం కంటి వెలుగు అనే బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా కంటి చికిత్సను అందిస్తుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాంతినగర్ కౌన్సిలర్ అజయ్, బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షులు అజేయ్, డాక్టర్ షాహెల్, మైనార్టీ సెల్ టౌన్ ప్రెసెండ్ సలీమ్ పాషా, మెప్మా సునీత, ఆర్ పి కళావతి, సంగీత పాల్గొన్నారు.

చెస్ ఆటతో మేధాశక్తి పెరుగుతుంది

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విద్యార్థి దశ నుండే చెస్ ఆడటంలో మేదాశక్తి పెరుగుతుందని అదనపు కలెక్టర్ నటరాజన్ అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఓపెన్ కేటగిరీ కింద జిల్లా స్థాయి చెస్ పోటీలను గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఆర్డీఓ రాథోడ్ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీఎం జన్మదినం సందర్భంగా మహిళలకు చెస్ పోటీలను నిర్వహించడం, జిల్లా స్థాయిలో ప్రతిభ సాధించిన వారిని రాష్ట్ర స్థాయిలో పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అమలు పరచడంతో పాటు దేశ స్థాయిలో గుర్తింపు సాధించడం జరుగుతున్నాయని తెలిపారు. ఆర్డీఓ మాట్లాడుతూ చెస్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లి, జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని అన్నారు. 64 మంది



విద్యార్థులు, మహిళలు చెస్ పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీపీఆర్ఓ ఎన్.భీమ్ కుమార్, చెస్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు విఠల్ రెడ్డి, పి.రాజేష్, జీ. నాందేవ్, పి.అజయ్, పెటా కార్యదర్శి ఎస్.స్వామి పాల్గొన్నారు.

చేసిన సేవలకు తప్పక గుర్తింపు ఉంటుంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ వ్యక్తి మరణించాక కూడా ఆయన గురించి ఆలోచిస్తున్నామంటే ఆయన చేసిన మంచి కార్యక్రమాలే దానికి నిదర్శనమని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గణిత మేధావి సర్దార్ ధర్మేందర్ సింగ్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్‌లోని ధర్మ పాఠశాలలో కాల్సా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సర్దార్ ధర్మేందర్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మేందర్ సింగ్ జయంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు గణితం, సైన్స్ పైన నిర్వహించిన ఒలంపియాడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎనగంటి ప్రకాష్, ధర్మేందర్ సింగ్ కుటుంబ సభ్యులు సోహన్ సింగ్, సొసైటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి, జీవన్‌రెడ్డి, పసుల ప్రతాప్, సట్ల అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థుల మార్కులు పరిశీలన



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఫర్మెటివ్ అసైన్మెంట్ మార్కులను పరిశీలన బృందం గురువారం మండల కేంద్రంలోని వివిధ పాఠశాలలో పరిశీలన చేపట్టింది. ఆ బృందం సభ్యుడు కృష్ణారావ్ నేతృత్వంలో మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు పాఠశాలలో ఏడాదికి నిర్వహించిన నాలుగు ఎఫ్‌ఏ పరీక్షల మార్కులపై ఆరాతీశారు. బృందం సభ్యులు చంద్రశేఖర్, రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హిమబిందు, అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

మన ఊరు-మన బడి పనులలో నాణ్యత పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రవేశ పెట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సెక్టోరియల్ అధికారి జే.నారాయణ సూచించారు. గురువారం మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. సందర్భంగా నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు చేయాలని గుత్తేదారు అశన్న, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్య, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి ఉన్నారు.

బీసీ సంక్షేమ శాఖ అధికారులను తొలగించాలి

నవతెలంగాణ-నిర్మల్



బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులను విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్, ఉపాధ్యక్షుడు నవీన్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ వరుణ్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు జిల్లా వ్యాప్తంగా హాస్టళ్ల విజిట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టడం లేదన్నారు. గతంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థుల నష్టపోతున్నారన్నారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు కార్యాలయంకే పరిమితం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి హాస్టళ్లకు కొందరు వార్డెన్‌లు రావడం ఆరోపించారు. భైంసా పట్టణంలో ఉన్న బీసీ మేనేజ్మెంట్ బాలుర హాస్టల్‌లో గత కొంతకాలంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, పెట్టిన భోజనంలో గతంలో పురుగులు వచ్చాయని గుర్తు చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు చర్యలు తీసుకోవటం లేదన్నారు. హాస్టల్లో సరిపడా మరుగుదొడ్లు లేవని, సమస్యలపై వివరంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులకు వినతం పత్రం ఇచ్చిన ఫలితం లేకపోయిందని వివరించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ



నవతెలంగాణ-బజార్ హత్నూర్

మండలంలోని జతర్ల గ్రామానికి చెందిన చరణ్ దాస్, మధుకర్, హరిదస్‌ల మాతమూర్తి రాదాబాయి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ గొడం నగేష్ మృతురాలి కుటుంబసభ్యులను గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అయన వెంట మాజీ మండల కన్వీనర్ నానం రమణ, ఎంపీటీసీ ఈశ్వర్ పాల్గొన్నారు.

రెండవ రోజు ఈవెంట్స్‌లో 146 అభ్యర్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెండవ విడత పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై శారీరక దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా ఆదిలాబాద్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో రెండవ రోజు గురువారం మహిళా అభ్యర్థుల పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. మహిళా అభ్యర్థులు ఉదయం నుండే పరీక్షా కేంద్రానికి హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్, బయోమెట్రిక్, రెస్ట్ బ్యాండ్, ఆర్ఎఫ్ఎస్ఐడిలను పూర్తిచేసుకుని 800 మీటర్ల పరుగులో పాల్గొన్నారు. పరుగులో ఉత్తీర్ణత పొందిన మహిళ అభ్యర్థులకు ఎత్తు, 4 మీటర్ల షాట్ పుట్, 2.5 మీటర్ల లాంగ్ జంప్ అంశాల తదుపరి పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. మహిళా అభ్యర్తులలో ఏజెన్సీ అభ్యర్థులు కూడా పాల్గొనడం జరిగిందని తెలిపారు. కాగా గురువారం రెండవ రోజు 772 మహిళా అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 626 అభ్యర్థులు పరీక్షలకు హాజరై, 146 అభ్యర్థులు గైర్హాజరయ్యారు. హాజరైన అభ్యర్థులలో 279 మహిళా అభ్యర్థులు అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా రెండు మొబైల్ టాయిలెట్ వాహనాలను ఏర్పాటు చేసి, మహిళా సిబ్బంది ద్వారా పర్యవేక్షిస్తూ పరీక్షలను నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని మహిళా అధికారినిలతో పాటుగా, అదనపు ఎస్పీలు ఎస్ శ్రీనివాసరావు (పరిపాలన), బి.రాములు నాయక్, సి.సమయ్ జాన్ రావు, ఆర్.వెంకటేశ్వర్లు, పోలీస్ కార్యాలయం పరిపాలన అధికారి యునుస్ అలీ, డీఎస్పీలు వి.ఉమేందర్, సిహెచ్ నాగేందర్, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన బాటలో నడవాలి

నవతెలంగాణ-కడెం

బంజారా కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడుద్దామని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ అన్నారు. గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ జయంతికి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ పటేల్ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫిక్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారు : వన్నెల అశోక్



నవతెలంగాణ-తలమడుగు

రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. గురువారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన పాత నందిగామ, కొత్త నందిగామ, రేకులగూడా, నర్సాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సోనియా గాంధీ కృషితో తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిందని గుర్తు చేశారు. మరికొద్ది నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రతాప్, హర్షద్, గణేష్, రమేష్, సంజీవ్, బాపూరావు, వెంకన్న, గంగారాం, విట్టల్, మోహన్, స్వామి భూమన్న పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ట్విటర్ వేదికగా పలువురు ప్రజాప్రతినిధులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తన జన్మదిన వేడుకల్లో పాల్గొని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం భాగ్యలక్ష్మి మిల్క్ సెంటర్ నిర్వహకులు దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోలీస్‌శాఖ ఉద్యోగుల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కేకును కట్ చేశారు. కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌లు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ కొరిపల్లి విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పాల్గొన్నారు. అనంతరం శాస్త్రినగర్‌లో లక్కిడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.

గిరిజన గూడెంలో శ్రీహరిరావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సారంగపూర్

మండలంలోని ఇప్పచెల్మే, లింగపూర్, పెండల్దారి, అంతుల్‌బాయి గిరిజన గూడెంలో బీఆర్ఎస్ నాయకులు హధి అధ్వర్యంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమ నాయకుడు కుచాడి శ్రీహరిరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధ్భంగా కెట్ కట్ చేసి స్వీట్లు పంచి శుభాకాక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. గూడెం 300 మంది గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేసివారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు పేద ప్రజల కోసం ప్రతి నిత్యం ఎనలేని కషి చేస్తున్నారు కపటం ఎరుగని మహనీయులని వారి సేవలను కొనియాడారు. మారెన్నో పుట్టిన రోజులు జరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమలో ఉద్యమ కారులు గాజుల రవీందర్, రొడ్డ మారుతి, బొల్లోజి నర్సయ్య, ఎస్.వెంకటరమణరెడ్డి, అరవింద్, రాజ్ కుమార్, సర్పంచులు గంగారం, అనూష బాయి, రత్నా బాయ్, ఆహిషా సిద్దిక పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్ అయినట్లు కేయు పరీక్షల విభాగం అదనపు అధికారి డాక్టర్ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, ఉట్నూర్ అజ్మీరా రేఖ శ్యామ్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, నిర్మల్ దీక్ష కళాశాలలో ఇద్దరూ, మంచిర్యాల వాగ్దేవి కళాశాలలో ఒకరు, మంచిర్యాల వివేకవర్ధిని కళాశాలలో ఒకరు చొప్పున డిబార్ అయ్యారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-తలమడుగు

రైతుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్రలోని విదర్భలో కలపాలంటూ రైతు నల్ల పద్మాకర్ రెడ్డి గురువారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్తును 24 గంటలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంటల బీమా దళితబంధు, దళితబస్తీతోపాటు బోరు బావులు, విద్యుత్తు మోటర్లు అందించాలన్నారు. గిరిజనులకు ఐటీడీఏ ద్వారా 100శాతం సబ్సిడీలు అందించాలని కోరారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన వారిలో రైతులు రావుల ప్రేమేందర్ రెడ్డి, చిన్నన్న, లక్ష్మన్న, స్వామి, రవీందర్ రెడ్డి, అశోక్, గంగారెడ్డి, సంజీవ్, ప్రభాకర్ శ్రీకాంత్ ఉన్నారు.

మంత్రిగా రామన్న చేసిందేమీలేదు

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



ఐదేండ్లు అటవీశాఖ మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే జోగు రామన్న గిరిజనులకు చేసిందేమీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. గురువారం మండలంలోని కచ్‌కంటి గ్రామంలో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సంతోష్, విజయ్, మయూర్ చంద్ర, దయాకర్, రత్నాకర్ రెడ్డి, జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, రము, దత్తు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంతో కుటుంబ సభ్యుల ఆందోళన

నవతెలంగాణ-లోకేశ్వరం

కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి వారం రోజులైనా తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు తెలిసిన వివరాల ప్రకారం మండలంలోని పిప్రి గ్రామనాకి చెందిన అనుగంటి సర్సయ్య(37) ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లాడు. వారం రోజులు అవుతున్నా ఇంటికి తిరిగి రాకపోవటంతో బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. కుటుంబ సభ్యులు కొండగట్టుకు సైతం వెళ్లి వెతికారు. గురువారం నరసయ్య భార్య రాధ లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో గురువారం నిర్వహించిన టెలికాం ఇండస్ట్రీలోని పలు కంపెనీలలో ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి శిక్షణ అదనపు కలెక్టర్ శ్రీజ ముఖ్య అతిథిగా హాజరై నిరుద్యోగులకు దిశా నిర్దేశం చేశారు. పదవ తరగతి అర్హతతో టెలికాం ఇండస్ట్రీలోని పలు కంపెనీల్లో ఉద్యోగాలు భర్తీ చేయనున్న నేపథ్యంలో జిల్లా నలుమూలల నుండి అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చిన తర్వాత ఉచిత వసతితో వేతనం చెల్లించనున్నారు. కార్యక్రమంలో డీఆర్డిఓ కిషన్, వివిధ కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సీమంతం, అక్షరాభ్యాసం

నవతెలంగాణ-మంచిర్యాల



పట్టణంలోని అర్యాలవాడ 1, 2వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాలింతలకు సీమంతం, చిన్న పిల్లలకి అక్షరాభ్యాసం అన్నప్రాశన నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ శ్రీరాముల మల్లేష్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మాజీ కోఆర్డినేటర్ అత్తి సరోజా, సీడీపీఓ స్వరూప రాణి, అంగనివాడీ సూపర్ వైజర్ చందన, నోడల్ అధికారి హెమాసత్య, ఏఎన్ఎం విజయ, అంగన్వాడీ టీచర్ సురేక, ఆర్‌పీలు జ్యోతి, రాణి, సునీత, వార్డ్ జనరల్ సెక్రటరీ ఉష్కమళ్ళ శంకర్, యూత్ ప్రెసిడెంట్ కోతురి శంతోష్ పాల్గొన్నారు.

నీటిపారుదల వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో నీటిపారుదల వ్యవస్థ గతంతో పోలిస్తే మెరుగుపడిందని మరింత అభివృద్ధి పరిచేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేని మల్లేష్ అన్నారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారిని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని నీటిపారుదల శాఖ ప్రాధాన్యత ఎంతో ఉందని దానికి మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ అబ్దుల్లా, అమర్ బిన్ అహ్మద్ పాల్గొన్నారు.

కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం

ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో విశ్రాంతి సమయంలో నీడను కల్పించాలని మంచిర్యాల డీఆర్‌డీఓ శేషాద్రి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల పని దినాలను వెంటవెంటనే రికార్డులో నమోదు చేయాలన్నారు. పని అయిన వెంట వెంటనే వారి అకౌంట్లో డబ్బులు పడేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఏపీఓ రవీందర్ సర్పంచ్ జాడి గంగాధర్, కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-కౌటాల

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి గావుడె హన్మంతు అన్నారు. గురువారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వీరవెల్లి, పార్డీ, ప్రాథమికోన్నత పాఠశాల కౌటీలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించొద్దని, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల విద్యాబోధనను పరిశీలించి పలు సూచనలు చేశారు. లెసన్ ప్లాన్ ద్వారా విద్యను బోధించి మెటీరియల్ ఉపయోగిస్తూ బోధన చేయాలని వారికి సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేసి విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సీఆర్‌పీ ప్రకాష్ ఉన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఎమ్మెల్యే సహకారం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక 20వ వార్డుకు చెందిన నిరుపేద యువతి అయిన స్రవంతి వివాహానికి గురువారం ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యేలు బాల్క సుమన్ బాల్క ఫౌండేషన్ ద్వారా రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు.. ఆర్థికంగా ఇబ్బందిలో ఉన్న చెల్లికి (స్రవంతి) త్వరలోనే కళ్యాణలక్ష్మి చెక్కు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, స్థానిక కౌన్సిలర్ బోయినపల్లి అనిల్‌రావు, కౌన్సిలర్ జాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రామిడి కుమార్, కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రేవెల్లి ఓదెలు, యువ నాయకులు కొండ కుమార్, గోనె రాజేందర్, లక్ష్మీ కాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనుల పరిశీలన



కౌటాల : మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు-మన బడి పనుల పురోగతిని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ గురువారం పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తిచేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. పనులను త్వరగా పూర్తిచేసి విద్యార్థుల విద్యాబోధన కొనసాగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, తహసీల్దార్ మునావర్ షెరీఫ్, ఎంపీడీఓ అబ్దుల్ నస్రుల్లాఖాన్, ఎంఈఓ సోమయ్య, ఎంఎల్ రాజు, కార్యదర్శి సాయికృష్ణ ఉన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన దేవాలయాలు

వాంకిడి : ఈ నెల 18న నిర్వహించే మహాశివరాత్రి జాతరకు మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు గాదె ప్రవీన్ గురువారం తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాతర ఉత్సవాలు ప్రారంభం

కౌటాల : మండలంలోని తాటిపెల్లి కుర్తా వద్ద గల శివసిద్ధి హనుమాన్ ఆలయంలో గురువారం నుంచి మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ప్రారంభమైనట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎలుములె దత్తు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు నదిలో నీరు ఎక్కువగా ఉన్నచోట భక్తులకు వెళ్లకుండా వాలంటీర్లను సైతం నియమించినట్టు ఆయన తెలిపారు. పుణ్యస్నానాల అనంతరం దైవ దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్‌లో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రౌతు యాదవ్, భజరంగ్‌దళ్ ఉన్నారు.

20న పాదయాత్రను జయప్రదం చేయాలి

వాంకిడీ : ఈ నెల 20వ తేదీ నుండి నిర్వహించే గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్రను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకుడు శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఓ నెం.60 ప్రకారం వేతనాలు పెంచాలని, జీపీ కార్మికులకు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. పాదయాత్రలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్నా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌటాల : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన తెలిపారు.

మస్టర్లు నిండిన

కార్మికులకు ఇంటి అద్దె చెల్లించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



మందమర్రి ఏరియాలో మస్టర్లు నిండిన క్వార్టర్ లేని కార్మికులకు యాజమాన్యం ఇంటి అద్దె చెల్లించకపోవడంపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం కేకేగనిపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అన్ని ఏరియాలకు భిన్నంగా మందమర్రి ఏరియాలో గుర్తింపు ప్రాథమిక సంఘాలు యాజమాన్యం పిలిచే అధికారిక సమావేశాలకు వెల్తూ మరి కార్మికులకు గత 2 సంవత్సరాలుగా ఇంటికిరాయి చెల్లించకపోవడంపై మాత్రం అధికారులతో మాట్లాడడం లేదని అన్నారు. క్వార్టర్లు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్న అధికారులు ఎందుకు కార్మికులందరికీ మంచి క్వాటర్లు ఇవ్వడం లేదని, 190/240 నిండిన కార్మికులకు వెంటనే జనరల్ మజ్దూర్, వారికి ఇచ్చే బదిలీ వర్కర్ మస్టర్లను కూడా పరిగణలోకి తీసుకొని ప్రమోషన్లు ఇవ్వాల్సిన సర్క్యులర్ను పక్కకు పెట్టడం సరికాదని అన్నారు. అలాగేకొత్తగా ఓసీలలో మహిళ కార్మికుల వస్తున్నందున వారికి ప్రత్యేక రెస్ట్ రూమును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గనుల కార్యాలయాల్లో పనిచేస్తున్న క్లరికల్ యాక్టింగ్ క్లరికల్ సిబ్బంది కూర్చోవడానికి సరైన కుర్చీలు, కంప్యూటర్ ప్రింటర్స్, స్కానర్స్ కంప్యూటర్లు స్పేర్ పార్ట్స్ లేక విధులు నిర్వర్తించడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, డీఓపీ ని పెంచాలని కోరుతూ మేనేజర్ భూ శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ సంకే.వెంకటేష్, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటస్వామి, అల్లి రాజేందర్, జె.వెంకటేష్, జె.ప్రవీణ్, దొండ నవీన్, తిరుపతి నాయక్, చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కుమురంభీం అసిఫాబాద్ జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా నాయకులు కలెక్టర్ హేమంత్ సహదేవరావుకు వినతిపత్రం ఇచ్చారు. ముందుగా నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నా తమకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని, తమకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అర్హులైన వారికి రెండో విడత అక్రిడేషన్‌లు జారీ చేయాలని, రాష్ట్ర స్థాయి బస్ పాసులో 1/3 ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని, టోల్ గేట్లలో జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలి

రైతులకు మద్దతుగా పత్తి ధరకు సంబంధించి ఇచ్చిన వినతిపత్రంలో భాగంగా వారు మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రారంభంలో పత్తి క్వింటాలుకు సుమారుగా రూ.10 వేలు ఉండగా, ఇపుడు గణనీయంగా తగ్గి రూ.7900కు చేరుకుందని తెలిపారు. దీనితో రైతులు గిట్టుబాటు ధర కోసం ఆందోళనలు చేశారు. రూ.10,000 గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.మహేష్, ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు టి.సురేందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్.సతీష్, కోశాధికారి కృష్ణ మోహన్ గౌడ్, రవి, జలీల్ బెగ్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో ఘరానా మోసం

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డ్రా చేసి ఇస్తామంటూ ఏటీఎం కార్డును మార్చి డబ్బులు దోచుకెళ్లిన సంఘటన మండలకేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో చోటు చేసుకుంది. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు ఏటీఎం సెంటర్‌లో డబ్బులుడ్రా చేసుకోవడానికి మండలకేంద్రంలోని గొల్లవాడకు చెందిన మెరుగు సుధాకర్ అనే వ్యక్తి రూ.4 వేలు డ్రా చేయడానికి ప్రయత్నిస్తుండగా డబ్బులు రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు తనకు సహకారం చేస్తున్నట్టు నమ్మించి పిన్ నెంబర్ సైతం తెలుసుకొని అతని ఏటీఎం కార్డు తీసుకొని వారి వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డు అతనికి ఇచ్చి అతని కార్డు నుండి రూ.4 వేలు తీసుకొని కారులో వెళ్లిపోయారు. డబ్బులు డ్రా చేసినట్టు సదరు వ్యక్తికి శరవాణికి సమాచారం రావడంతో కంగుతిన్నాడు. వెంటనే బ్యాంకు మేనేజర్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. అప్రమత్తమైన మేనేజర్ సీసీటీవీ పుటేజ్ ఆధారంగా జరిగిన సంఘటన గుర్తించి తక్షణం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

● జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస రావు

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్



ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకమని, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస రావు సూచించారు. గురువారం మండలంలోని దుర్గానగర్ రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు రాయితీపై మొక్కలను ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. ఒక్క మొక్క ధర రూ.193 కాగా రూ.173 ప్రభుత్వం భరించి సబ్సిడీపై రైతుకు రూ.20 కే అందజేస్తోందని తెలిపారు. ఒక్క ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చని రైతులు ఎన్ని ఎకరాల్లోనైనా సాగుచేసుకోవచ్చన్నారు. ప్రతీ సంవత్సరం ఎరువుల, అంతర పంటకు ఖర్చులకు గాను ఎకరాకు రూ.4200 ఇస్తుందని, వరి పంట ఒక్క ఎకరం సాగు చేసే బదులు ఆయిల్ పామ్ పంటను 3 నుండి 4 ఎకరాలు సాగు చేయవచ్చని తెలిపారు. సూక్ష్మ సేద్యం పరికరాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీ ఉంటుందని, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ గెలలు అమ్మకానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, మ్యాట్రిక్స్ కంపెనీ నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తుందని తెలిపారు. జిల్లాలో 1048 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తక్కువ పెట్టుబడితో లాభాలు పొందవచ్చని రైతులు ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పెంచికల్ పేట్ ఏడీఏ రాజుల నాయుడు, కాగజ్‌నగర్ ఏఓ రామకృష్ణ, ఏఈఓ శైలేష్ పాల్గొన్నారు.

కౌటాల : ఆయిల్‌ఫామ్ చెట్ల పెంపకంతో అధిక లాభాలు పొందొచ్చని గుండాయిపేట్ ఏఈఓ చౌదరి అంజన్న అన్నారు. గురువారం మండలంలోని గుండాయిపేట రైతువేదికలో రైతులకు ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్‌ఫామ్ చెట్లను పెంచడంపై లాభాల గురించి వివరించారు. ఈ మొక్కల సాగుచేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై బ్రీత్ ఆయిల్‌ఫామ్ మొక్కలు అందజేయనున్నట్టు వారు తెలిపారు. కేవలం రైతు మొక్కకు రూ.20 చెల్లిస్తే సరిపోతుందన్నారు. పంట సాగు కోసం ప్రతి ఏడాది ప్రభుత్వం ఒక ఎకరానికి రూ.4200 అందించనున్నట్టు రైతులకు సూచించారు.

ఈ విధంగా నాలుగు సంవత్సరాల తర్వాత ఎకరానికి రూ.16,800 అందిస్తుందని, ఈ నాలుగు సంవత్సరాల పాటు ఇందులో అంతర్ పంటగా పెసరు, సోయా, చిక్కుడు, మినుములు తదితర పంటలను వేసుకోవచ్చని, ఆయిల్‌ఫామ్ పంటకు కోతులు, అడవిపందుల నుండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని, రైతులు ఈ పంట సాగుచేయాలన్నారు.

సందర్శకుల అవసరాల మేరకు సౌకర్యాలు

● ఎంపీపీ గోదరి రామాదేవి లక్ష్మణ్

నవతెలంగాణ-జైపూర్



వేలాల జాతరకు వచ్చే భక్తుల అవసరాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు గోదరి రమాదేవి లక్ష్మన్ తెలిపారు. గురువారం వేలాలలో జాతర ఏర్పాట్లు పరిశీలించారు. వేలాల శివారు పర్వత ప్రాంతంలో వెలిసిన గట్టుమల్లన్న సన్నిధిలో బారికేడ్ల పొడవు టెంట్లు, చలువ పందిర్లు వేయించడంతో పాటు తాగు నీటి కోసం ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పర్వత ప్రాంతం దిగువ నుంచి గట్టు మల్లన్న వెలిసిన గుట్ట దొన వరకు రహదారి ఏర్పాటు, చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చొరవతో వేలాల నుండి గుట్ట వరకు బీటీ రోడ్డు వేయించడం జరిగిందని తెలిపారు. దర్శనార్థం తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాగు నీటి సౌర్యం ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా భక్తులకు అందుబాటులో ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయనున్నామని తెలిపారు. అనంతరం భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గొద్దని జిల్లా పరిషత్ సీఈఓ నరేందర్ సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి గురువారం వేలాల గ్రామంలో జాతర ఏర్పాట్లు పరిశీలించారు. వేలాల పర్యటనలో భాంగంగా జెడ్పీసీఈఓ నరేందర్ గురువారం ఉదయం షెట్‌పల్లి శివారులో రాచర్ల వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతు ఆహ్వానం మేరకు జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, స్థానిక సర్పంచ్ మేడి రవి, ఎంపీటీసీ బోయిని స్వాతి సంపత్‌లతో కలిసి 6 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటించే కార్యమానికి హాజరైనట్లు తెలిపారు.

పవర్ ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

శాలివాన పవర్ ప్లాంట్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (వరంగల్)ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ 2022 సెప్టెంబర్ మాసం నుంచి ఇప్పటి వరకు కార్మికులకు రావాల్సిన వేతనాలు మూడు సంవత్సరాల బోనసులు ఇప్పించాలని, యధావిధిగా ప్రతినెల వేతనాలు చెల్లించి, కంపెనీలో కార్మికుల బయోమెట్రిక్ విధానాన్ని కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పది సంవత్సరాలపాటు ప్రభుత్వంతో పవర్ పర్చేస్ అగ్రిమెంట్ పీపీఏ చేసుకుని పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అదేవిధంగా కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా శాలివాహన పవర్ ప్లాంట్ యాజమాన్యంపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు జి.ప్రకాష్, ఉపాధ్యక్షులు ఎస్.ఆనందరావు, ఆసరి రాజయ్య కార్యదర్శి, అనుమాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం



నవతెలంగాణ-జన్నారం

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్- తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు పాల్గొనగా.. ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వారికి జిల్లా స్థాయిలో ఈనెల 22న పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ్రు జనార్ధన్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, జాడి మురళి, కే.రాజన్న పాల్గొన్నారు.

జర్నలిస్టులకు కంటి వెలుగు నిర్వహించాలి

● టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేశ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జర్నలిస్టులకు ప్రత్యేకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించాలని టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) నాయకులు కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్ట్‌గా నిత్యం విధి నిర్వహణలో తీరికలేకుండా విలేఖరులు అనేక కంటి సమస్యలతో బాధ పడుతున్నారని అన్నారు. దీనితో ప్రభుత్వం నిర్వహించే కంటి వెలుగును సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని తెలిపారు. అసిఫాబాద్ నియోజకవర్గ జర్నలిస్టుల కోసం అసిఫాబాద్‌లో, సిర్పూర్(టీ) నియోజకవర్గ జర్నలిస్ట్ ల కోసం కాగజ్ నగర్‌లో ఒక రోజు ప్రత్యేకంగా కంటి వెలుగును నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.మహేష్ ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు టి.సురేందర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్.సతీష్, కోశాధికారి కృష్ణ మోహన్‌గౌడ్, రవి, జలీల్ బెగ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

● జిల్లా బాలల సంరక్షణ అధికారిని శ్రీమతి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

బాల్య వివాహాలు జరుగకుండా ఆపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా బాలల సంరక్షణ అధికారిని శ్రీమతి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ టీచర్లకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికి బాల్య వివాహాలు జరుగుతున్నాయని, దీనికి ప్రధాన కారణం పిల్లల తల్లిదండ్రులు చట్టాలపై, ఆరోగ్యం విషయాలపై అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అవగాహన లోపంతో అనారోగ్యానికి గురవుతున్నారని, దీనివల్ల పుట్టబోయే పిల్లలకు అనారోగ్య సమస్యలతో జన్మిస్తున్నారన్నారు. చట్టప్రకారం ఆడపిల్లలకు 18 ఏండ్లు, అబ్బాయిలకు 21 ఏండ్ల వయసు పూర్తయిన తర్వాత వివాహం జరిపించాలని, వీటిపై గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరిపించిన వారికే కాకుండా వివాహానికి హాజరైన ప్రతి ఒక్కరు శిక్షార్హులేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని ముత్తంపేట గ్రామంలో అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులకు గురువారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలోపం లేకుండా పనులు నిర్వహించాలని, అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో అంతర్గత రోడ్లు వేయడానికి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదె శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, గ్రామాధ్యక్షుడు రమేష్, ఎస్ఎంసీ చైర్మన్ జాడి విజయ్, సొసైటీ డైరెక్టర్ శంకర్, వార్డుసభ్యులు ధోని రవి పాల్గొన్నారు.



విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లినికల్ సైకాలజిస్టు జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీకాంత్ అన్నారు. ప్రత్యేక సమయ సారిణి తయారు చేసుకుని అంశాలవారీగా సన్నద్ధం కావాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. ప్రశాంతమైన మనస్సుతో, ఏకాగ్రతతో పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అర్థంకాని విషయాలను సంబంధిత విషయ నిపుణులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జీవితంలో పరీక్షలు మాత్రమే శాశ్వతం కాదన్నారు. సబ్జెక్టుపై పట్టు సాధిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. తద్వారా ఒత్తిడి తగ్గి పరీక్షల్లో మంచి మార్కులు సాధించే అవకాశం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నారాయణరెడ్డి, వసతిగృహాల సంక్షేమ అధికారులు సురేందర్, విఠల్, దత్తు, జావేద్, పొగాకు నియంత్రణ విభాగం సామాజిక కార్యకర్త చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజన గ్రామాలకు మంజూరైన రోడ్లను వెంటనే పూర్తి చేయాలని టీఏజీఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఉయిక విష్ణు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బడ్జెట్ సమావేశాలలో ఆదివాసుల అభివృద్ధికి తక్కువ నిధులు మంజూరు చేసి తీవ్ర అన్యాయం చేశాయన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఆదివాసీ గ్రామాలలో రోడ్డు, కరెంట్ వంటి మౌలిక సౌకర్యాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే 68 గ్రామాలకు రూ.52 కోట్లు రోడ్ల కోసం కేటాయించామని ప్రకటించారని, ఈ మంజూరైన నిధులతో రోడ్లను వెంటనే పూర్తి చేయాలని కోరారు. లేని పక్షంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసులను సమీకరించి పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో టీఏజీఎస్ మండల ఉపాధ్యక్షుడు కొట్నాక్ చందు పాల్గొన్నారు.

ముల్కల్ల గోదావరి పుష్కర ఘాట్ మూసివేత



నవతెలంగాణ - హాజీపూర్

లోతు ఎక్కువగా ఉన్నందున ముల్కల్ల గోదావరి పుష్కర ఘాట్ మూసివేస్తున్నట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం ట్రైనీ కలెక్టర్ గౌతమితో కలిసి ఏసీపీ పుష్కర్ ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని నలుమూలల నుండి వచ్చే ప్రజలు ముల్కల్ల పుష్కర ఘాట్ వద్ద స్నానాలు చేయడానికి రావద్దని కోరారు. లోతు ఎక్కువగా ఉన్నందున ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సంజీవ్, ఎస్ఐ ఉదయ్‌కిరణ్, తహసీల్దార్ రాజలింగం, ఎంపీడీఓ, సర్పంచ్ మంచాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పనిసరిగా రక్షణ సూత్రాలు పాటించాలి

నవతెలంగాణ-నస్పూర్

భారీ యంత్రాల వద్ద తప్పనిసరిగా రక్షణ సూత్రాలు పాటించాలని, యంత్రాల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని మందమర్రి ఏరియా రక్షణ అధికారి ఓదెలు, కేకే గ్రూప్ డిప్యూటీ ఇంజనీర్ రాంప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆర్కె7 గనిలో యంత్రాలపై తీసుకుంటున్న జాగ్రత్తలు, వాటి రక్షణ చర్యలపై గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణ అధికారి రవిశంకర్‌తో కలిసి తనిఖీ చేశారు. గని లోపల కేంద్రాలపై తీసుకుంటున్న జాగ్రత్తలను, యంత్రాల వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలను పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ యంత్రాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా కార్మికులు యంత్రాల వద్ద రక్షణ పరికరాలు ధరించి పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ రమేష్ పాల్గొన్నారు.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 353 OF 2016

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT
VERSUS
Banoth Sudheer Singh & 4 Others
To
Opponent No.1. Banoth Sudheer Singh, S/o. Kishan Lal, Age: 27 years, Occ: Assistant, State Bank Of India, Nayakangudem, Kusumanchi, R/o. H.No.1-23, Erlapudi(P), Khammam Urban, Khammam District.
Opponent No.2. Banoth Bala Jyothi, D/o. Kishan Lal, Age: 33 years, Occ: Head Cashier IN SBH, Khammam, R/o. H.No.1-23, Erlapudi(P), Khammam Urban, Khammam District.
Opponent No.3. Eesala Ravi Kumar, S/o. Pagadaiah, Age: 30 years, Occ: Assistant, State Bank Of India, Nayakangudem, Kusumanchi, R/o. H.No.12-154, Sirpur Colony, Manchirial Mandal, Adilabad District.
Opponent No.5. Goddugorla Ramesh, S/o. Gopaiah, Age: 34 years, Occ: Asst Manager in SBI, Nayakangudem, R/o. H.No.2-90, Maddulapalli(V), Kusumanchi Mandal, Khammam District.
......OPPONENTS
Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 90,976=00 against you and others and where as the above Arbitration/
Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 156 OF 2016

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 8-2-216, Kothagudem Town, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT
VERSUS
Gajula Buchi Babu, & 5 others
To
Opponent No.2. Dabbeti Laxmi Narayana, S/o. Venkaiah, Age: 60 years, Occ: Shearer Operator, SCCL, Kothagudem, R/o. Q.No.297, 8 Incline, Srirampur, Adilabad District.
Opponent No.4. Gaddam Rajeswar, S/o. Posham, Age: 51 years, Occ: Fitter, SCCL, Kothagudem, R/o. H.No. D/389, Venkatesh Khani, Kothagudem Mandal, Khammam District.
......OPPONENTS
Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 16,887=00- against you and others and where as the above Arbitration/
Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ADILABAD
ARB.NO. 493 of 2022

Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
Nirmal -Branch ... Disputant
A N D
Mr.Govind Rao Banoth & Others ....Opponents
1. Mr. Govind Rao Banoth, S/O. Redya Nayak, Aged About: 40 Years, Occ: Agriculter Work, R/O. H.No: 1-57,Vankamaddi,Sirpur U, Adilabad.
2. Mr. Ravinder Banoth, S/O. Reddya B, Aged About 42 Years, Occ: P.D Grade-Ii, O/O. Chinchu ghat Adilabad, R/O.H.No.1-58, Vill.Vankamaddi Chorpally, Sirpur U, Dist. Adilabad.
3. Mr. Gopi Chand Banoth, S/O. Reddya B, Aged About 36 Years, Occ: Language Pandit, O/O. Z.P.S.S Echoda Adilabad, R/O.H.No.1-38, Vill.Vankamaddi, Mdl.Sirpuru .U, Dist Adilabad.
4. Mr. Jithender Jadhav, S/O. Gangaram J, Aged About 40 Years, Occ: S.G.T Teacher, O/O. Z.P.S.S Danthanpally, R/O. H.No. 1-93/1, Vill.Kothapalli, Mdl. Sirpur.U, Dist. ADILABAD.

Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same,the above dispute is posted on 04-03-2023 at 11:00 A.M. For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.

//By order of This Office//
sd/-DEPUTY REGISTRAR OFCHITS/ARBITRATOR ADILABAD

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT :: ADILABAD
Succession O.P. No. 08 of 2022

Between:
Dande Pothanna
... Petitioner
// AND //
To Whomsoever it may concerned
... Respondent
To
To Whomsoever it may concern
Whereas the above named petitioner filed the above Succession O.P., for mutate the agriculture land i.e., to an extent of Ac. 02.20 Gts, in Sy.No. 42/ఇ3 situated at Village Vadoor, Mandal Bheempur, Dist. Adilabad for grant of Succession Certificate in his favour, in which the respondent is to whomsoever it may concern i.e., public in general, and the matter stands posted on 24.02.2023 at 10.30 A.M., for appearance of interested parties if any, and if any body has got any objection, in granting Succession Certificate in favour of the Petitioner by this Hon'ble Court, they can appear before the Hon'ble Court to make their objections, failing which the matter will be heard and decided ex-parte, according to law.

// BY ORDER OF THE COURT //
Sd/-
KEMA SRIKANTH,
ADVOCATE, ADILABAD

ప్రజాభిప్రాయ సేకరణ విజయవంతం

నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే 5,6 భూగర్భ గని విస్తరణలో భాగంగా గురువారం కృష్ణ కాలనీలోని శాంతి మైదానంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ విజయవంతంగా కొనసాగింది. ప్రజాభిప్రాయ సేకరణ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ జి లక్ష్మణ్ ప్రసాద్ సమక్షంలో నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్, ఏఐటియుసి, సిఐటియు, బిఎంఎస్, హెచ్ఎంఎస్, టిఎన్టియుసి నాయకులు, నస్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, ప్రభావిత ప్రాంతాలైన నస్పూర్, తాళ్లపల్లి, కాన్కూర్, రామారావుపేట, గుడిపల్లి, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని గని విస్తరణలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న జాగ్రత్తలను కొనియాడారు. దేశానికే వెలుగులు విరజిమ్ముతున్న సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో భాగంగా గనులను విస్తరించటం పూర్తిగా మద్దతిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి పరిసర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, పిల్లల పార్కులు, ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే తాగునీటి సమస్య లేకుండా చేయాలని, సింగరేణికి సంబంధించిన సిఎస్ఆర్, డిఎంఎఫ్టీ నిధులను సింగరేణి పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాలని తెలిపారు.



గ్రామానికి సింగరేణిగా నామకరణం చేస్తాం : వెంకటేశ్వర్‌గౌడ్, కాన్కూర్ సర్పంచ్

సింగరేణి గనులు విస్తరణలో భాగంగా కాన్కూర్ గ్రామంలో 5 ఎకరాల మేర పర్యావరణం దెబ్బతింటుంది. సింగరేణి సంస్థ గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయం చేసుకోవడానికి సహాయం చేయాలి. గ్రామాన్ని దత్తత తీసుకొని రోడ్ల విస్తరణ, పార్కు అభివృద్ధికి సహాయం చేయాలి. స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలి. ఐమాస్ట్ లైట్లు పెట్టాలి. సింగరేణి సహాయ సహకారాలు అందిస్తే గ్రామానికి సింగరేణిగా నామకరణం చేస్తాం.



సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి అన్ని విధాల సాయం : జీఎం సంజీవరెడ్డి

సింగరేణి విస్తరణలో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి అన్ని విధాల సింగరేణి యాజమాన్యం సహాయం చేస్తుంది. రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తాం. రైతు పొలాలకు నీరందించేందుకు చెక్‌డ్యాంలను ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో యూనియన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సానుకూలంగా స్పందించి పూర్తి మద్దతు తెలిపినందుకు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలో గురువారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విస్తృతంగా పర్యటించారు. జక్కపల్లి గ్రామ శివాలయంలో ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహ శంకు స్థాపన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం జిల్లెడ, సూరారం, బుయ్యారం, సుంపుటం గ్రామాలలో రూ.1కోటి 46 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మత్తడివాగు వద్ద 6కోట్ల 15లక్షల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నీల్వాయి నుండి రాచర్ల వరకు 6కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మూడు కల్వర్టుల పనులను ప్రారంభించారు. సుంపటం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో గ్రామాలు, పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఎక్కడా లేని విధంగా రాష్టంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, దేశ ప్రజలు తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏవిధంగా అభివృద్ధి చెందుతుందో దేశం కూడా ఆ విధంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ దేశ రాజకీయాలలోకి వెళ్లారని అన్నారు. మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అధికారంలో ఉన్న యాభై సంవత్సరాల కాలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటున్న తనపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొనగిరి నిరంజన్ గుప్తా, వైస్ చైర్మన్ లింగాగౌడ్, ఎంపీపీ కోళి స్వర్ణలత, వైస్ ఎంపీపీ గణపతి, బీఆర్ఎస్ అధ్యక్షులు కోళి వేణుమాధవ్‌రావు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలకు రూ.10వేల విరాళం



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మంచిర్యాల మహిళా తరంగిణీ (మమత)స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి సామాజిక బాధ్యతగా రూ.10 వేల విరాళం అందజేశారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు చదువుకోవడానికి అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేయడానికి మమత సభ్యురాలు సత్యవతీ రామాంజనేయులు ఈ నగదును అందజేశారు. అదేవిధంగా జాయింట్ సెక్రటరీ కొత్తలీల సురేందర్ 50 కిలోల బియ్యం అందజేశారు. అధ్యక్షురాలు చందూరి సునీత మహేందర్ మాట్లాడుతూ మరిన్ని ఉపయోగకరమైన విరాళాలు కళాశాలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంచిర్యాల రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. జైకిషన్ ఓజా, వైస్ ప్రిన్సిపాల్ డా.గంగయ్య, ఐక్యుఎసి కో ఆర్డినేటర్ సవిత, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కుమారస్వామి, లైబ్రేరీ ఇంచార్జ్ డా. రాజ్ కుమార్ , అధ్యాపకులు డా. శ్రీలత, డా. సురేష్, డా. హరేశ్, మంజుల, ఇందిరాదేవి, మల్లయ్య, మహేష్, రాయలింగు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకల సౌకర్యాల కల్పనకు కృషి

- జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మీ
- డిగ్రీ కళాశాలలో చెస్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. కెసిఆర్ జన్మదినం పురస్కరించుకొని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన చెస్ పోటీలను జెడ్పిటిసి నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధి కోసం అన్ని రకాల గురుకులాలను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం పిల్లలతో కలిసి చెస్ ఆడి, కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, డిటిడిఓ మణెమ్మ, జిసిడిఓ శకుంతల, ఏటిడిఓ క్షేతయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శారద, పిఈటిలు మధుసూదన్, సాగర్, నాయకులు గోపాల్ నాయక్, నిసార్, ఇమ్రాన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ADILABAD
ARB.NO. 488 of 2022

Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
Bhainsa -Branch ...Disputant
A N D
Mr. Jithender Jadhav & Others ....Opponents
2. Mr. Pradeep Jadhav, S/O. Baliram, Aged About 40 Years, Occ: S.G.T, O/O. M.P.P.S Luxetipet Utnoor Adilabad, R/O. H.No: 6-55, Tosham Tanda, Gudihathnoor, Adilabad.
4. Mr. Suresh Jadhav, S/O. Ravu jee, Aged About 46 Years, Occ: S.G.T, O/O. T.W.P.S, Molal gutta Mamidiguda, R/O. H.No:2-58/5, Chinchari, Khanapur, Nirmal.

Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same,the above dispute is posted on 04-03-2023 at 11:00 A.M. For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.

//BY ORDER OF THIS OFFICE//
sd/-DEPUTY REGISTRAR OFCHITS/ARBITRATOR ADILABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ADILABAD
ARB.NO. 564 of 2022

Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
Bhainsa -Branch ...Disputant
A N D
Mr.Dhan Raj Jadhav & Others ....Opponents
3. Mr. Vinodkumar Jadhav, S/O. Premsingh, Aged About 34 Years, Occ:Language Pandit Gr-2, O/o. Z.P.S.S Kanpa Mediguda R Jainad Adilabad, R/O.H.No: 7-46, Thosham Thanda, Thosham, Gudihatnoor.

Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same,the above dispute is posted on 04-03-2023 at 11:00 A.M. For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.

//By order of This Office//
sd/-DEPUTY REGISTRAR OFCHITS/ARBITRATOR ADILABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ADILABAD
ARB.NO. 492 of 2022

Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
Nirmal -Branch ...Disputant
A N D
Mr. Mohan Ure & Others ....Opponents
3. Mr. Swamy Ure, S/o. Narsaiah, Aged About 43 Years, Occ: Private Employee, R/O. H.No. 2-52, Vill: Dhannoor-B, Mdl: Boath, Dt: Adilabad

Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same,the above dispute is posted on 04-03-2023 at 11:00 A.M. For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.

//By order of This Office//
sd/-DEPUTY REGISTRAR OFCHITS/ARBITRATOR ADILABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ADILABAD
ARB.NO. 490 of 2022

Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
Nirmal -Branch ...Disputant
A N D
Mr. Srikanth Borigam & Others ....Opponents
4. Mr. Mahesh Jinka, S/o. Venkataramana, Aged About 26 Years, Occ: Busienss, R/O. H.No. 1-24/1, Vill: Kuntala, Mdl: Neradi gonda, Dist: Adilabad.

Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same,the above dispute is posted on 04-03-2023 at 11:00 A.M. For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.

//By order of This Office//
sd/-DEPUTY REGISTRAR OFCHITS/ARBITRATOR ADILABAD

ప్రాణహిత పరివాహక ప్రాంతంలో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని కల్లంపల్లి గ్రామంలో గురువారం పోలీసులు మీకోసం కార్యమాన్ని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకెన్ నిర్వహించారు. ప్రాణహిత పరివాహక ప్రాంతంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోని ఫెర్రీ పాయింట్స్‌ని సందర్శించారు. పడవలు నడిపే వారితో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పేదలకు బియ్యం, దుప్పట్లు, యువకులకు ఆట వస్తువులు డీసీపీ, జైపూర్ ఏసీపీ నరేందర్, సీఐ, ఎస్ఐలతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, నీల్వాయి ఎస్ఐ నరేష్, కోటపల్లి ఎస్ఐ వెంకట్ పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ హిందీ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ రాబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, గ్రూపులుగా విభజించి బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు

పీఏసీఎస్ చైర్మన్‌ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పిఎసిఎస్ చైర్మన్‌ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ అన్నారు. కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న బొర్కడే హేమంత్ సహదేవ్‌రావ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా పరిషత్ సమావేశాలకు తమకు అనుమతి ఇచ్చేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పెండింగ్‌లో ఉందని, పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. ఆయన వెంట వాంకిడి, కౌటాల, సిర్పూర్(టి) మండలాల చైర్మన్‌లు పెంటు, మాంతయ్య, బాపు, డైరెక్టర్ మురళీ ఉన్నారు.

ఓపెన్ వర్శిటీ పరీక్ష తేదీల్లో మార్పులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ పరీక్ష తేదీలలో మార్పులు చోటు చేసుకున్నట్లు ఎస్‌కెఇ డిగ్రీ కళాశాల కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ముందు నిర్ణయించిన డిగ్రీ సెమిస్టర్-3 పరీక్షను ఈ నెల 26న కాకుండా 27వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న నిర్వహించాల్సిన డిగ్రీ ఫైనలియర్ సెమిస్టర్-5 పరీక్షను మార్చి 18న నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్ఐ

నవతెలంగాణ - బెజ్జూర్

మహాశివరాత్రిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరంగనాయక దేవాలయం ప్రాంగణంలో ఈ నెల 18 నుండి 19వ తేదీ వరకు రెండు రోజుల పాటు నిర్వహించే జాతర ఉత్సవాలను ఎస్ఐ ఎస్ వెంకటేశ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. రంగనాయక దేవాలయం ప్రాంగణంలోని శివాలయం, హనుమాన్, శ్రీ విరాట్ పోతులూరి బ్రహ్మం గారి ఆలయం, రంగనాయక దేవాలయం జాతర సందర్భంగా ముస్తాబైన ఆలయాన్ని పరిశీలించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కమిటీని ఆదేశించారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని పాత మామిడిపల్లి గ్రామంలోని దొరగారి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు విధులకు ఆటంకం కలిగించారని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. గుడికందుల అనిల్, ఎండి దైసాబ్, గొట్ల మహేందర్ మద్యం తాగి వచ్చి అమర్యాదగా ప్రవర్తించి భయభ్రాంతులకు గురి చేస్తూ విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ మేరకు ఆ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆవులు తరలిస్తున్న వారిపై కేసు

దండేపల్లి: అనుమతులు లేకుండా ఆవులను రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో గూడెం చెక్‌పోస్ట్ వద్ద గోవులు తరలిస్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా సుమారు 80 గోవులను గుర్తించారు. గోవులను అనుమతులు లేకుండా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.